# వానొచ్చె ......

"ఈ పొద్దు వాన గ్యారంటు" అని అర్సినాడు[1] నాగిరెడ్డి. పొద్దున్నే వాళ్ల మిద్దె మీంద నిలబడుకోని, పెన్నపైన ఆకాశంలో పెరిగి పెరిగి వచ్చే మోడం[2] దిక్కు సూస్తా.

"ఏందో అబ్బీ, ఏందంత నమ్మకం?" అని యీదిలో ప్యాడగంప నెత్తిన బెట్టుకోని నిలబడుకోనున్న సంజన్న పైకి సూస్తా అడిగినాడు. "ఏందంత నమ్మకం?" అని సంజన్న నాగిరెడ్డిని అడిగినాడు గానీ, వాటం సూస్తే వానొచ్చేతట్టే వుండాదని లోలోపల తానూ సంబరపడ్తా, ఆశపడ్తానే వుండాడు.

అందుకే నాగిరెడ్డిని నగుతా నగుతా అడిగినాడు.

"అవు సిన్నాయనా ఈ రోజు గ్యారంటు, ఈ రోజు వాన్దేవుడు కళ్ళు తెర్సేది కాయం" అన్నాడు మళ్ళా నాగిరెడ్డి. ఈసారి సంజన్న గట్టిగానే నగినాడు. నగుతానే నెత్తిమీద ప్యాడ గంపతోనే మోడం నడిసే దిక్కు సూసినాడు. కల్లూరు మూల్న పుట్టిన మోడం పెరిగి పెరిగి ఇటు రేగళ్ళపల్లె, తాళ్ళమార్పురం మీదుగా పెన్న అవతలి దిక్కుకూ అటు సంబటూరు, కోగటం మీదుగా పొలిమేర దిక్కుకూ నడ్సుడం సూసి, ముశాలసాట్న[3] నగుకుంటా కుశాలగ ప్యాడగంప ఎత్తుకోని దిబ్బకు గునగున పరిగెత్తినాడు.

మిద్దె మీంద నిలబడుకోని మోడం దిక్కు సూస్తా వుండేది నాగిరెడ్డొక్కడే అనుకొంటివా....... ఓయమ్మా! అట్ట సూడు మల్ల, మిద్దెల మీంద ఎంతమంది నిలబడుకోని ఎగజూస్తావుండారో! గయిన[4] కాడ గానిగోళ్ళు మాడీ[5] పైకెక్కి ఇంటిల్లిపాది సూస్తా వుండారా, వాళ్ళ కాపక్కన బొగ్గరపోళ్ళు, ఈ పక్క ఇరంకుంట్లోళ్లు, యెనకాల బీరమోళ్ళు........ ఇంతెందుకబ్బా మిద్దెలున్నోళ్ళంతా ఎక్కి సూస్తానే వుండారు. ఇంగ పిల్లల కుశాలయితే సెప్పేపన్లా ! దగ్గుతో ఆయాసంతో రొప్పుతా వుండే కరెడ్ల నారయ్య గూడా మెల్లంగా తాపలు[6] దిగొచ్చి మోడం దిక్కు సూసి ......... ఎన్నేండ్ల నుంచో మర్సిపోయిన నగు నగబట్టె. రాతిరి తేలుకుట్టి, దాటిపోతదేమోనేట్టు బయపడిచ్చిన బాలమ్మ గూడా కుంటుకుంటా బయటికొచ్చి పంచలో కూర్చొని పైకి సూస్తాంది. వీధిలో పిల్లోడెవడో "వానొచ్చె, వంగడొచ్చె, సాకలోళ్ళ పిల్లకు సండ్లొచ్చె" అనర్సుతాంటే, "నోర్ముయ్యిరే, సాకలోళ్ళకేనా, కాపోళ్ళకు రావూ?" అని బాలమ్మ తిట్టింది. "సల్లగాలి మళ్ళిందబ్బీ, వచ్చేతట్టే వుంది" అంటూ నాగిరెడ్డి పక్కన అబ్బిరెడ్డి, ఆయన పెండ్లాం నారమ్మా, బిడ్డ ఎంగటమ్మా వచ్చి నిలబడినారు. నిజమే ......... సల్లగాలి మళ్ళింది. వానసారకలు దిగబడి వాసన కూడా వస్తోంది. "నిన్న గుడిపంపులో సేద్యం సేస్తాంటే ఏం ఉబ్బరపు ఎండ బెట్టిందని; అప్పుడే అనుకున్నా రేపో మన్నాడో వాన తప్పదని" అన్నాడు అబ్బిరెడ్డి. "అవు" అన్నాడు నాగిరెడ్డి. ఆ "అవు" ఉబ్బరపు ఎండకో, వానకో తెల్దుమల్ల.

"రొండ్రోజుల్లో వాన రాకుంటే సెనిక్కాయ పైరు బోడ్డిం[7] ఏసి పాయాల్సిందేనబ్బీ" అన్నాడు అబ్బిరెడ్డి. దీనిగ్గూడా 'అవు'నన్నాడు నాగిరెడ్డి. "ఏట్లో నడుంలోతు చెలమ[8] తీస్తే గానీ నీళ్ళు రావడం ల్యా" అంది నారమ్మ. దీనికి మాత్తరం 'అవు పిన్నీ' అన్నాడబ్బా నాగిరెడ్డి. ఇంతలో "మా....! నా నెత్తిన సినుకే" అని కెవ్వున అర్సింది ఎంగటమ్మ. "ఓస్నీ ........! వులిక్కిపడ్తిగదే" అని "సినుగ్గాదేమోలే" అంది నారమ్మ, వానొస్తాదని నమ్మనట్టు.

---

1) కేకేసినాడు 2) మేఘం 3) మీసాల 4) గవిని 5) మేడ 6) మెట్లు 7) వ్యవసాయపు పనిముట్టు 8) నీళ్ళ కోసం తవ్వే చిన్న గుంట

వాన వస్తాది వస్తాదనుకొంటే రాదనీ, రాదనుకొంటే వస్తాదనీ వాళ్ళకొక నమ్మకం. నమ్మకమంటే పూరా నమ్మకమనీ గాదు, అట్టుంటేనే మంచిదనుకొంటారు. ఎందుకంటే, ఎన్నో లచ్చలసార్లు వానవచ్చె అనుకొని, ఉత్తదైపోతే నిరాసపడి పోయినోళ్ళు గదా! అందుకని, అట్టా ఆశ పెట్టుకోకపోతే వాన వచ్చినా మంచిదే, అప్పుడే సంబరపడొచ్చు. లేదా, ఎట్టాగూ రాదనుకొన్నదే గదా అని వూరుకోవచ్చు. అది మాత్తరం సులువా అంటే కాదు...... అయితే ఏం జేయాల? ఆశ పెట్టుకోడానికైనా వాళ్ళకు అవకాశం వుండొద్దా? ఊర్కే ఊపిరి బుడ్డమాదిరి ఉబికిపోతే అవతల[9] ........ టాప్పని పగిలిపోవాల!

"మో........! సినుగ్గాదంటావ్, సూడు సూడే నాయిమ్మీన సూడు, పక్క సెవుకాడ సూడు" అంది ఎంగటమ్మ. వాళ్ళమ్మ సెయిపట్టి గుంజి. ఆ గుంజిన కూతురు సేతిమీదా, కూతురు సేతిలో వున్న తల్లి ముంజేతి మీదా మళ్ళా రెండు సినుకులు పన్నాయి. ఆ ఎంటనే టపాటపామని మొదలై, టపటపమని ఇస్పీడెక్కింది. నాగిరెడ్డి, అబ్బిరెడ్డీ, నారమ్మా అందరూ ఒకరి మొగం ఒకరు నగుతా సూసుకొన్నారు. మోడం కూడా నగుతాన్నెట్టు తలుక్కున మెర్సింది. ఎట్టా వుండారని వాళ్ళను పలకరిచ్చినట్టు మెరుపు ఎంటనే బడబడా ఉరిమింది. ఆ ఉరుము ఇంటానే అందరికీ లోపల్నించీ సంతోసం పైకి తన్నుకొచ్చింది. వాళ్ళ సంతోసం మాదిరే మట్టివాసన గమ్మున పైకెగజిమ్మింది.

ఈదుల్లో మోరలు పైకెత్తి వాసన పీల్చుకుంటున్న కుక్కలు, సెట్లల్లో రెక్కలు యిదిలిచ్చుకొంటున్న పిట్టలు....... వూరూ, ఏరూ, ఎండిపోతున్న పైరు అన్నీ "రా...రా, ర్రా....ర్రా..." అని వానను పిలుస్తున్నట్టున్నాయి. ఇప్పటికి ఏటిని ముంచేసింది వాన. "ఏరు కనపల్లా........ ఏరు కనపల్లా!" అని ఎగిరెగిరి అరుస్తాంది ఎంగటమ్మ. నిజానికి ఇప్పుడు వానొచ్చినా వాళ్ళు పూరాగా బాగుపడేదేం లేదు. ఇప్పటికే మూడు బాగాలు పైరు ఎండిపాయె. అయితే ఇప్పుడొచ్చినా, గొడ్లకింత మేత, ఇత్తనాల కర్సు తీరతాది. దీనికంటే ముక్కెం[10] వానెప్పుడొచ్చినా వానే! వాన రాక పన్న కట్టాలే తప్ప వానొచ్చి పన్న కట్టాలట్టే తెల్దు వాళ్ళకు.

ఈపాటికి వాన కోసం చూస్తున్న వాళ్ళంతా తడ్సిపోయిరి. "రాబ్బీ, ఇంగ బయం లేదు రా, వానొచ్చినట్టే, పోదాం పా తడ్సిపోతిమి" అని అబ్బిరెడ్డీ, నారమ్మ బంగపోయినా[11] నాగిరెడ్డి అట్నే నిలబడుకోని "మీరు పోండి" అనె! పైన్నుంచి కిందికి నీళ్ళు కారిపోతున్నా కండ్లు మూసుకోని నిలబన్న నాగిరెడ్డికి వాన వడి తగ్గినట్టు తెల్సి ........... కండ్లిప్పితే అప్పటికే అల్చిపోయినట్టు ఇచ్చిపోతాంది. వాన ఇంకా పెరుగుతాదని అనుకొంటా యిండ్లలో వున్నోళ్ళు మళ్ళా బయటికొచ్చినారు.

ఇప్పటికి రోంత[12] ముందు కనిపించిన మనుసులకూ, ఇప్పుడు కనిపించే మనుసులకూ ఎంత తేడా వుందో కండ్లతో సూసినవాళ్ళకు తప్ప ఇతర్లకు తెల్దు. ఇప్పుడెవరూ ఏం మాట్లాల్లేదు. ఒకరి మొగంలోకి ఒకరు సూసుకోవాలన్నా ఇట్టం లేనట్టుండిపోయినారు. పైకి సూస్తే..... మోడం ఏదో మోసమో, దొంగతనమో సేసినట్టు పారిపోతాంది పక్కపక్కలకు. ఇప్పుడు గూడా అక్కడెక్కడో మెర్సింది, ఉరిమింది. అయితే, ఆ మెరుపు ఆ ఉరుము ఇంతకుముందు వాళ్ళన్జూసి నగి, పలకరిచ్చినట్టు కాకుండా ...... ఎగతాళి సేస్తున్నట్టుగా, "మీ బతుకింతే" అన్నట్టు గుంది !

---

9) ఆ తర్వాత 10) ముఖ్యం 11) బ్రతిమాలిన 12) కొంచెం